సాక్షి
విజయనగరం
గురువారం । 11 । జూలై । 2024



పంట బీమా సంగతేంటి?

రైతన్నకు కష్టాలు మళ్లీ మొదలుకానున్నాయా? అంటే ప్రస్తుత పరిస్థితులు అలాగే కనిపిస్తున్నాయి.

- 8లో



హరహర మహాదేవ..

అపూర్వమైన శైవశిల్పాలకు ఆలవాలం గుళ్ల సీతారాంపురం. పదో శతాబ్దంలో ప్రసిద్ధి శైవ క్షేత్రంగా ఇది విరాజిల్లింది.

- 8లో



కాలిపోయిన చెట్లు

- 8లో

వేపాడ మండలం ఆతవ గ్రామంలో బుధవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఎర్రచందనం, టేకు చెట్లు కాలిపోయాయి.

భూచోళ్లు ఎవరు?

- భోగాపురం విమానాశ్రయ భూసేకరణపై టీడీపీ నాయకుల ద్వంద్వ వైఖరి
- 500 ఎకరాల మినహాయింపుపై అశోక్ సహా దుష్ప్రచారం
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడి ప్రకటనతో నోళ్లకు మూత
- ఆ భూమి ప్రభుత్వం వద్దే ఉందని ఉద్ఘాటన
- డీపీఆర్ ప్రకారం నిర్మాణానికి అవసరమైన భూమిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయింపు
- ఎంవోయూ ప్రకారం నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న భోగాపురం విమానాశ్రయ టెర్మినల్

చంద్రబాబు 3.0 పాలన: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 15 వేల ఎకరాల్లో నిర్మిస్తామంటూ టీడీపీ నాయకులు తొలుత ఫీలర్లు వదిలారు. దీన్ని ఎల్లో మీడియా ఊదరగొట్టింది. రైతులు ఆందోళన చెందారు. తమ భూములు ఇవ్వబోమంటూ ఉద్యమాలు చేశారు. దీంతో తూచ్... అని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రకటించుకుంది. 5,600 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో దిగొచ్చిన ప్రభుత్వం 2,700 ఎకరాలకే భూసేకరణను పరిమితం చేస్తూ మరోసారి నోటిఫికేషన్ ఇచ్చింది. ఇంతలోనే 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపించాయి. అప్పటికి భూసేకరణ కొలిక్కి రాలేదు. నిర్వాసితులకు నీడ చూపించనే లేదు. రైతులు హైకోర్టులో వేసిన కేసులు విచారణలోనే ఉన్నాయి. అంతకుమించి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులేవీ తీసుకురాలేదు. అయినప్పటికీ కేవలం ఎన్నికల్లో ప్రచారం కోసం, అంతా తానే చేశాననే క్రెడిట్ తన ఖాతాలో వేసుకోవాలని చంద్రబాబు 2019 ఫిబ్రవరి 14న శంకుస్థాపన చేశారు.

జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో...

వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విమానాశ్రయం నిర్మాణానికి ఉన్న అడ్డంకులన్నీ పరిష్కరించింది. జాతీయ రహదారి నుంచి విమానాశ్రయానికి అనుసంధానం చేసే ట్రంపెట్, రోడ్డు సహా విమానాశ్రయం నిర్మాణానికి 2,751 ఎకరాల భూసేకరణ ప్రక్రియను పక్కాగా పూర్తి చేసింది. కేసులు వేసిన రైతుల డిమాండ్లను పరిష్కరించింది. రెట్టింపు పరిహారం ఇచ్చింది. నిర్వాసితులకు దాదాపు రూ.80 కోట్లతో టౌన్‌షిప్‌ను తలదన్నే సౌకర్యాలతో కాలనీలను నిర్మించింది. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ సహా కోర్టుల్లో ఉన్న అన్ని వివాదాలను పరిష్కరించుకోవడమే గాక కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులన్నీ తీసుకొచ్చింది. ఆ తర్వాతే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి 2023 మే 3న జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేశారు. 500 ఎకరాల మినహా మిగతా భూమిని నిర్మాణ సంస్థ జీఎంఆర్‌కు స్వాధీనం చేశారు. ఈ ఏడాది కాలంలోనే 25 శాతానికి మించి నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. దాదాపు రూ.5 వేల కోట్లతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2025 డిసెంబర్ నాటికల్లా ఏటా 60 లక్షల మంది ప్రయాణించే సామర్థ్యంతో తొలి దశ పూర్తి చేస్తామని స్వయంగా జీఎంఆర్ అధినేత జి.మల్లికార్జునరావు ప్రారంభోత్సవ సభలో ప్రకటించిన విషయం తెలిసిందే.

సాక్షి ప్రతినిధి, విజయనగరం: అదే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం...అదే సమగ్ర ప్రణాళిక నివేదిక (డీపీఆర్)... అదే నిర్మాణ సంస్థ (జీఎంఆర్)... ఎక్కడా మార్పులు లేవు. కానీ గత చంద్రబాబు పాలనలో తొలుత 5,600 ఎకరాలు, రైతులు వ్యతిరేకిస్తే దిగొచ్చి 2,700 ఎకరాలు నిర్మాణ సంస్థకు అప్పగించేందుకు అంగీకరించేశారు. కానీ తర్వాత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 2,200 ఎకరాలు విమానాశ్రయ నిర్మాణ సంస్థకు ఇచ్చి, మిగతా 500 ఎకరాల్లో విమానయాన రంగ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించడానికి నిర్ణయించారు. డీపీఆర్‌లో కానీ, ఎంవోయూలో కానీ ఎలాంటి మార్పు లేకుండా ఈ నిర్ణయం తీసుకుంటే టీడీపీ నాయకులకు నచ్చలేదు. ఆ 500 ఎకరాలపై అశోక్ గజపతిరాజు కూడా పదేపదే దుష్ప్రచారం చేశారు. భవిష్యత్తు అవసరాల కోసం ఆ భూమి పూర్తిగా ప్రభుత్వ స్వాధీనంలోనే ఉందని నాటి మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేసినా వారి వాదనలో మాత్రం మార్పు రాలేదు. మంగళవారం విమానాశ్రయ నిర్మాణ పనులను పరిశీలించడానికి వచ్చిన ఆ టీడీపీ ఎంపీ, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఆ 500 ఎకరాలు ప్రభుత్వం వద్దే ఉన్నాయని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏమి చెప్పిందో ఇప్పుడు ఆయన నోట కూడా అవే పలుకులు వచ్చాయి. ఇప్పుడైనా టీడీపీ నోళ్లు మూతపడతాయో లేదో చూడాలి.

● గతం మరచిపోతే ఎలా...

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న వైమానిక దళం విమానాశ్రయాన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మార్పు చేయలేని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. భోగాపురం మండలంలో 15 వేల ఎకరాలు అవసరమని టీడీపీ నాయకులు ప్రచారం చేయడంతో రైతులు ఆందోళనలకు దిగారు. దీంతో ఐదు వేల ఎకరాలకు నాటి టీడీపీ ప్రభుత్వం దిగొచ్చింది. తీరా పరిహారం కూడా ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున మాత్రమే ప్రకటించింది. దీన్ని వ్యతిరేకిస్తూ 2015 ఆగస్టులో రైతులు మరోసారి రోడ్డెక్కారు. భూసేకరణ నిబంధనలేవీ పాటించకుండా నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ కొంతమంది హైకోర్టులో పిటిషన్లు వేశారు. న్యాయస్థానంలో విచారణ పెండింగ్‌లో ఉండగానే 2019 సార్వత్రిక ఎన్నికలు వచ్చేశాయి. మరోవైపు నిర్వాసితులకు పరిహారం, పునరావాసం ఏమీ పూర్తి చేయలేదు. ఏదిఏమైనా సరే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తానే నిర్మించానని చెప్పుకోవాలనే తహతహతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు రెండు నెలల ముందు ఫిబ్రవరి 14వ తేదీన హడావుడిగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి విజయనగరం జిల్లా టీడీపీ ముఖ్యనాయకుడు పూసపాటి అశోక్‌గజపతిరాజు డుమ్మా కొట్టడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అప్పటివరకూ కేంద్ర ప్రభుత్వంలో పౌరవిమానయాన శాఖ మంత్రిత్వ శాఖను ఆయనే స్వయంగా నిర్వహించినా భోగాపురం విమానాశ్రయానికి కావాల్సిన అనుమతులనూ తీసుకురాలేకపోయారు.

● వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే ఘనత...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే భోగాపురం విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన అనుమతుల కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు చేశారు. మరోవైపు క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నారు. పరిహారాన్ని భూమి పరిస్థితిని బట్టి ఎకరాకు రూ.28 లక్షల నుంచి రూ.36 లక్షల వరకూ ప్రకటించారు. అంతకుముందు డి.పట్టా భూములకు టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఎకరాకు రూ.12.50 లక్షలు మాత్రమే. వారికీ జిరాయితీ భూమితో సమానంగా పరిహారాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. దీంతో రైతులు చాలామంది పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. మిగతావాటినీ సర్వోన్నత న్యాయస్థానం పరిష్కరించింది.

● అడ్డంకులన్నీ అధిగమించి భూసేకరణ

విమానాశ్రయ నిర్వహణకు, ఇతర అనుబంధ కార్యకలాపాలకు 2,750.78 ఎకరాలు సరిపోతాయని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో 422.69 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక 1,413 మంది రైతులకు చెందిన 1,383.39 ఎకరాల జిరాయితీ భూమి, 572 మంది లబ్ధిదారుల స్వాధీనంలోనున్న డీ పట్టా (అసైన్డ్) భూమి సేకరణ ప్రక్రియను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. విమానాశ్రయం నిర్మాణానికి ప్రభుత్వం సుమారు 2,203 ఎకరాలను కేటాయించింది. మిగతా 500 ఎకరాలను విమానయాన అనుబంధ రంగ పరిశ్రమలు, ఐటీ రంగ అభివృద్ధికి కేటాయించాలనే ఆలోచన చేసింది. చెన్నై–హౌరా జాతీయ రహదారిపై నుంచి నేరుగా విమానాశ్రయానికి వెళ్లేందుకు వీలుగా అనుసంధాన రోడ్డు, ట్రంపెట్ ఆకారంలో ఫ్లై ఓవర్ నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణ రెండోదశ కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తి అయ్యింది. దీంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 25 శాతానికి పైగా పూర్తి అయ్యాయని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటించిన విషయం తెలిసిందే.

నిర్వాసితులకు టౌన్‌షిప్...

ఇళ్లు కోల్పోయిన 376 కుటుంబాల కోసం రూ.80 కోట్ల వ్యయంతో టౌన్‌షిప్‌లను తలదన్నేలా రెండు కాలనీలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే నిర్మించింది. అంతేగాకుండా ఒక్కో కుటుంబానికి పునరావాస పరిహారంగా ఐదు సెంట్ల స్థలం, రూ.8.70 లక్షల చొప్పున పునరావాస పరిహారాన్ని మంజూరు చేసింది. నిర్వాసిత గ్రామాల నుంచి గతంలో వలసపోయిన కుటుంబాలకూ మానవతా దృక్పథంతో ఇంటిస్థలం ఇవ్వాలని నిర్ణయించింది. జాతీయ రహదారిని ఆనుకొని 25 ఎకరాల భూసేకరణను ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసింది. సంబంధిత రైతులకు సుమారు రూ.18 కోట్ల వరకూ పరిహారాన్ని చెల్లించింది. విమానాశ్రయ అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా క్వార్టర్ల నిర్మాణానికి 25 ఎకరాలు, విద్యుత్తు సబ్‌స్టేషన్ భోగాపురం మండలంలోని ముక్కాం రెవెన్యూ పంచాయతీ పరిధిలో 5.47 ఎకరాల భూమిని కేటాయించింది.



గూడెపువలస నిర్వాసిత కాలనీలో నిర్వాసితులు నిర్మించుకున్న గృహాలు

న్యూస్‌రీల్

13న సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

బొబ్బిలి: చిత్తూరు జిల్లా పుత్తూరులో వచ్చే నెల 10 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఏపీ సీనియర్ సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్ జరగనుంది. ఇందులో ప్రాతినిథ్యం వహించే జిల్లా స్థాయి క్రీడాకారుల జట్టు ఎంపిక పోటీలను పారాది జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 13న ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఇనుగంటి విజయకుమార్, ఉపాధ్యక్షుడు సుంకరి సాయి రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహిక స్త్రీ, పురుష క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. క్రీడాకారులు తమ గుర్తింపు కార్డులతో హాజరుకావాలన్నారు.

ఎఫ్‌పీఓల పురోగతే లక్ష్యం

- జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

విజయనగరం అర్బన్: వ్యవసాయ అనుబంధ విభాగాల అధికారులందరూ ఎఫ్‌పీఓల (రైతు ఉత్పత్తిదారుల సంస్థ) పురోగతికి సహకరించాలని, అవసరమైన అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని జేసీ కె.కార్తీక్ ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నాబార్డు ఆధ్వర్యంలో ఎఫ్‌పీఓల అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నెల 1 నుంచి ఆగస్టు 14 వరకు ఎఫ్‌పీఓల సాచ్యురేషన్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఎఫ్‌పీఓలో సభ్యత్వం పెంచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆగస్టు నాటికి అన్ని ఎఫ్‌పీఓలలో 500 సభ్యత్వాన్ని సాధించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులను ఎఫ్‌పీఓలలో సభ్యులుగా చేర్పించాలన్నారు. రైతులు ఎఫ్‌పీఓల ద్వారా వ్యవసాయ యంత్రాల పనిముట్లు అద్దె చెల్లించి సేవలు పొందేందుకు అవసరమైన అధ్యయనం చేయాలని జేసీ సూచించారు. సమావేశంలో నాబార్డు డీడీఎం నాగార్జున పాల్గొన్నారు.

రైతుబజార్లలో నిత్యావసర సరుకుల విక్రయం

విజయనగరం అర్బన్: నిత్యావసర సరుకుల ధరల నియంత్రణలో భాగంగా గురువారం నుంచి జిల్లాలోని రైతు బజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో సరసమైన ధరలకే కందిపప్పు, బియ్యం విక్రయిస్తామని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం పట్టణంలోని దాసన్నపేట, ఆర్‌అండ్‌బీ, ఎంఆర్‌హెచ్ రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ఎస్‌కోట, కోటారుబిల్లి రైతుబజార్లు, పట్టణంలోని సూపర్ మార్కెట్‌లోనూ ప్రత్యేక కౌంటర్ నిర్వహిస్తామన్నారు. కేజీ కందిపప్పు (దేశవాళీ) రూ.160కు, బియ్యం (సోనామసూరి) స్టీమ్ రూ.49, ముడిబియ్యం కిలో రూ.48కు విక్రయిస్తామని తెలిపారు. వినియోదారుల సౌకర్యార్థం ప్రతి రోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రత్యేక విక్రయ కేంద్రాలను అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రతి కుటుంబానికి ఒక కిలో కందిపప్పు, 5 కిలోల బియ్యం విక్రయిస్తామన్నారు.

ఉచిత ఇసుక పేరుతో దోపిడీ

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: పేద ప్రజలకు ఉచిత ఇసుక సరఫరా పేరుతో అధికారంలోకి వచ్చిన నెల రోజులకే టీడీపీ మోసం చేయడం ఆరంభించిందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. పార్టీ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇసుక ఉచితంగా సరఫరా చేస్తామని చెప్పి... స్టాక్ యార్డుల వద్ద టన్నుకు రూ.675 వసూలు చేస్తుండడం విచారకరమన్నారు. ఇది పచ్చిఅబద్ధాల ప్రభుత్వమని తేలిపోయిందన్నారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో 72,466 మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వ ఉందని, ఇసుక కోసం వచ్చే వారు ధర చూసి బెంబేలెత్తిపోతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం టన్నుకు రూ.475 మాత్రమే రవాణా చార్జీల పేరిట వసూలు చేసేదని, నేటి టీడీపీ ప్రభుత్వం ఉచితమని ప్రకటిస్తూ రూ.675లు వసూలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రవాణా ముసుగులో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వ పెద్దలు సిద్ధమైనట్లు తెలుస్తోందన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ పాలన దోచుకుందామా... దాచుకుందామా అన్న రీతిలో ఉంటుందని విమర్శించారు. ఇసుక ఉచితంగా సరఫరా చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు చేయూత డబ్బులు వారి ఖాతాలకు జమకాకుండా ప్రభుత్వం అడ్డుకోవడం తగదన్నారు. చేయూత డబ్బులు పడని మహిళల ఉసురు చంద్రబాబుకు తగులుతుందని మండిపడ్డారు. అనంతరం జన్నివలస గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మండల యూత్ కన్వీనర్ పత్తిగుళ్ల ఏక్‌నాథ్ పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కిర్ల చంద్రశేఖర్, కనిమెరక అప్పారావు, నడిమింటి సత్యం, గొట్టాపు పైడిపునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్:

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం భోగాపురం గ్రీన్‌ఫీల్డు విమానాశ్రయం పరిశీలించనున్నారని, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని, పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ కె.కార్తీక్, డీఆర్వో ఎస్.డి. అనిత, ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

భోగాపురం: భోగాపురంలో సీఎం పర్యటన ఏర్పాట్లను ఎస్పీ దీపికతో కలిసి కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పరిశీలించారు. ఇప్పటికే నిర్మితమై ఉన్న రన్‌వేపై ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ స్థలాన్ని ముందుగా పరిశీలించారు. ఫొటో ఎగ్జిబిషన్, వీఐపీ ల్యాంజ్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. పర్యటనలో జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, జీఎంఆర్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు హెడ్ రామరాజు, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

● ఇదేం పనయ్యా..!





ఈ చిత్రాలు చూశారా... ఇవి రామభద్రపురం మండలం రొంపల్లి గ్రామాల్లో గత ప్రభుత్వం లక్షలాది రూపాయలతో నిర్మించిన ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్ర భవనాలు. ఓ భవనాన్ని స్థానికులు కొందరు ఏకంగా పేకాట, మద్యం సేవించే నిలయంగా మార్చేయగా, మరో భవనాన్ని వంట కలప, పశుగ్రాసం దాచుకునేందుకు వినియోగిస్తున్నారు. రైతులకు, గ్రామస్తులకు సేవా కేంద్రాలుగా ఉపయోగపడే భవనాలను ఇలా నిర్లక్ష్యంగా వినియోగిస్తుండడంపై గ్రామస్తులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భవనాలను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. ఈ అంశంపై సచివాలయ కార్యదర్శి శంకరరావు మాట్లాడుతూ భవనాలను అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించరాదని హెచ్చరిస్తూ దండోరా వేసినా కొందరు యువకుల్లో మార్పురాలేదన్నారు. భవనాల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. – రామభద్రపురం

క్లుప్తంగా

పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షణ చేస్తున్న దేవాదాయశాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ఈఓ ప్రసాదరావు తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీల ఆదాయాన్ని బుధవారం అమ్మవారి కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు మాట్లాడుతూ అమ్మవారి చదురుగుడిలో ఉన్న తొమ్మిది హుండీల నుంచి 37 రోజులకు గాను రూ.13 లక్షల 43 వేల 881 నగదు, 18 గ్రాముల 600 మిల్లీగ్రాముల బంగారం, 486 గ్రాముల వెండి లభించిందని చెప్పారు. జిల్లా దేవాదాయ, ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ పర్యవేక్షణలో తనిఖీదారు పీవీ.లక్ష్మి , పోలీస్ అధికారులు, కెనరా బ్యాంక్ అధికారులు, పైడితల్లి ఆలయ అధికారులు, స్వచ్ఛంద సేవకులు, సిబ్బంది ఈ లెక్కింపులో పాల్గొన్నారు.

15న సహారా బాధితుల ర్యాలీ



మాట్లాడుతున్న సీనియర్ కార్యకర్త దాస్

పార్వతీపురం: ఈనెల 15న పార్వతీపురం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు సహారా బాధితులతో ర్యాలీ, ధర్నా నిర్వహించనున్నట్లు ఉత్తరాంధ్ర జిల్లాల సహారా సీనియర్ కార్యకర్త బీఎల్ దాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు తెలిపారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో కార్యకర్తలు, బాధితులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహారా బాధితులకు న్యాయం చేస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో చేపట్టే ర్యాలీని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, ఖాతాదారులు హాజరు కావాలని కోరారు.

ముగ్గురు యువకులకు గాయాలు



తీవ్ర గాయాల పాలైన హేమకుమార్

కొత్తవలస: అరకు–విశాఖ రోడ్డులో తుమ్మికాపల్లి గేటు సమీపంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు గాయాల పాలయ్యారు. బుధవారం జరిగిన ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్కవరపుకోట మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన హేమకుమార్, పవన్‌కుమార్‌లు ద్విచక్రవాహనంపై కొత్తవలస వైపు వస్తున్నారు. ఈ క్రమంలో తుమ్మికాపల్లి గేటు సమీపంలో రోడ్డు దాటుతున్న లక్కవరపుకోట మండలం పోతంపేట గ్రామానికి చెందిన భాస్కర్‌ను తప్పించబోయి ఢీకొట్టారు.దీంతో డ్రైవింగ్ చేస్తున్న హేమకుమార్‌కు తీవ్రగాయాలు కాగా పవన్ కుమార్, భాస్కర్‌లు స్వల్ప గాయాలపాలయారు. దీంతో వారిని స్థానికుల సహాయంతో కొత్తవలస పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు.

మైనర్లకు బైకులిస్తే తల్లిదండ్రులపై కేసులు



తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: మైనర్లకు బైకులిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదుచేస్తామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం రాత్రి పలు ప్రాంతాల్లో ఆయన ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు, నంబర్ ప్లేట్స్ సక్రమంగా లేని వాహనాదారులకు ఈ చలానాలు విధించారు. వాహనాలు నడుపుతుండగా కనిపించిన మైనర్లను అడ్డుకుని వారి వాహనాలను స్టేషన్‌కు తరలించి, వారి తల్లిదండ్రులను, వాహన యజమానులను స్టేషన్‌కు పిలిపించి, వారి సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్‌లకు వాహనాలివ్వడం వాహన యజమానులదే తప్పని, మైనర్ల వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే వాహన యజమానులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు హరిబాబు నాయుడు, నరేష్ పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹117	₹204	₹214

పంట బీమా సంగతేంటి?

- ప్రీమియం భారం రైతు భరించాల్సిందేనా?
- పాత విధానం అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు
- గడిచిన ఐదేళ్లలో ప్రీమియం చెల్లించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



నారు పోయడానికి పొలం దున్నుతున్న రైతు

విజయనగరం ఫోర్ట్: రైతన్నకు కష్టాలు మళ్లీ మొదలు కానున్నాయా? అంటే ప్రస్తుత పరిస్థితులు అలాగే కనిపిస్తున్నాయి. అధికారంలోకి వస్తే రైతులకు గత ప్రభుత్వం కంటే ఎక్కువ మేలు చేస్తానని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు రైతులకు చుక్కలు చూపిస్తోంది. రైతు భరోసా పథకం కింద రూ.20 వేలు ఇస్తానని చెప్పిన హామీకి ఇంతవరకు అతీగతీ లేదు. దీంతో రైతన్న దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలిచింది. విత్తు దగ్గర నుంచి ఎరువు వరకు అన్నీ వారి చెంతకే అందించింది. పంట పెట్టుబడికి వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 సాయం అందించింది. అంతేకాకుండా పంట బీమా ప్రీమియం కూడా రైతుల తరఫున వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించేది. ఏటా బీమా ప్రీమియం కోసం కోట్లాది రుపాయలు వెచ్చించింది. పంటనష్టం జరిగితే బీమా పరిహారాన్ని కూడా సకాలంలో అందజేసేది.

పాత విధానంలో అమలు అంటే?

ఇదిలా ఉండగా ప్రభుత్వం పంటల బీమాను పాత విధానంలోనే అమలు చేయాలని కొద్ది రోజుల క్రితం వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమావేశంలో సీఎం చంద్రబాబు చెప్పారు. పాత విధానంలో అంటే రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఇది వారికి భారం కానుంది. దీంతో రైతులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును గుర్తు తెచ్చుకుంటున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఉచిత బీమా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రమే జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసింది. పంటలబీమాకు సంబంధించి రైతులు చెల్లించాల్సిన పూర్తి ప్రీమియాన్ని ఏటా రూ.13 కోట్లు వరకు చెల్లించేది. పంట సాగు చేసిన రైతులు ఈ–క్రాప్, ఈకేవైసీ చేయించుకుంటే చాలు. ఈకేవైసీ అయిన పంటకు ప్రభుత్వం పంటలబీమా కింద ప్రీమియం చెల్లించింది. దీని వల్ల ఏదైనా విపత్తు వచ్చి పంటనష్టం జరిగితే పంట దెబ్బతిన్న రైతులందరికీ బీమా సొమ్ము అందేది.

బీమా కింద రూ. 33.08 కోట్ల చెల్లింపు

జిల్లాలో 2019 నుంచి 2022–23 వరకు జరిగిన పంట నష్టానికి 37, 497 మంది రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.33.08 కోట్లు పంటల బీమా కింద చెల్లించింది. వరి, మొక్కజొన్న, ఉద్యాన పంటలకు ప్రభుత్వం వైఎస్సార్ పంటల బీమాను అమలు చేసేది. జిల్లాలో ప్రస్తుతం వరి పంట 93 వేల హెక్టార్లు, మొక్కజొన్న 15 వేల హెక్టార్లు, ఉద్యాన పంటలు 60 వేల హెక్టార్లలో సాగవుతున్నాయి.

నిబంధనలు రాలేదు

పంటల బీమాకు సంబంధించి ప్రభుత్వం నుంచి నియమ నిబంధనలు ఇంకా రాలేదు. గైడ్‌లైన్ వచ్చిన తర్వాత వాటి ఆధారంగా పంటల బీమా పథన్ని అమలు చేస్తాం.

వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



ఎం.సింగుపురంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పాలకొండ రూరల్: పిల్లవాడు మంచి స్థితిలో ఉన్నప్పుడే గురువు సంతృప్తి పొందుతాడని.. దానిని ఉపాధ్యాయులు, అధికారులు తమ పనితీరుగా భావించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం పాలకొండ మండలంలోని ఎం.సింగుపురం పీహెచ్‌సీ, ప్రభుత్వ పాఠశాల, మల్లివీడు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ పనితీరును ఆకస్మికంగా పరిశీలించారు. ఆ సమయంలో అధికారులనుద్దేశించి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పై విధంగా పేర్కొన్నారు. తొలుత పీహెచ్‌సీకి చేరుకున్న కలెక్టర్ అక్కడ సేవలు పొందుతున్న రోగులతో మాట్లాడి వారి సలహాలను స్వీకరించారు. వైద్యాధికారి ఎస్.రవికుమార్ పీహెచ్‌సీ పరిధిలో గ్రామాలు, అందిస్తున్న సేవలు, అందుబాటులో ఉన్న మందుల వివరాలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మమేకమైన కలెక్టర్ పలు ప్రశ్నలు సంధించారు. కాసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థుల ప్రతిభాపాటవాలు, మధ్యాహ్న భోజన తీరుపై ఆరాతీశారు. అనంతరం సమీప గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను స్వయంగా పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలు నిస్సంకోచంగా వారి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, అధికారులు అత్యంత నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ రణస్థలం రామదేవి, రాంబాబు, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తదితరులున్నారు.

కాలిపోయిన ఎర్రచందనం, టేకు చెట్లు



కాలిపోయిన చెట్లు

వేపాడ: మండలంలోని ఆతవ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో ఎర్రచందనం, టేకు చెట్లు కాలిపోయాయి. ఇందుకు సంబంధించి ఎస్‌కోట అగ్నిమాపక సిబ్బంది అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గేదెల సత్తిబాబుకు ఉన్న జిరాయతీ పొలం సుమారు ఎకరాన్నరలో సాగుచేస్తున్న ఎర్రచందనం , టేకు మొక్కలు అగ్నిప్రమాదంలో కాలిపోతున్నట్లు గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ అగ్నిప్రమాదంలో సుమారు లక్షరూపాయల ఆస్తినష్టం సంభవించి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. సమీపంలో చెత్తకు నిప్పుపెట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



బాడంగిలో ధర్నాచేస్తున్న అంగన్‌వాడీలు

- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

బాడంగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ మేరకు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంవద్ద వారంతా సమావేశమై నినాదాలు చేస్తూ ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం తమ కోర్కెలతోకూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ కె.రాజ్యలక్ష్మికి అందజేశారు. వారి డిమాండ్లలో ముఖ్యంగా కొన్ని కేంద్రాలలోఅధికారపార్టీ నాయకులు, కార్యకర్తలను బలవంతంగా రాజీనామాలు చేయమని బెదిరిస్తున్నారని, సెంటర్లకు తాళాలు కూడా వేస్తున్నారని హెల్పర్లను ఉద్యోగాలు మానేయాలని బెదిరిస్తున్నారని అలాంటివేధింపులుమానుకోవాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని, బడ్జెట్‌పెంచాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు. గతంలో 45రోజులసమ్మెకాలంలో గత ప్రభుత్వం జారీచేసిన మినిట్స్‌కాపీలను జీఓలుగా మార్చాలని డిమాండ్ చేశారు. వాటితోపాటు మరికొన్ని డిమాండ్లతో వారంతా నిరసనవ్యక్తంచేశారు. ఈ ధర్నాలో యూనియన్ అధ్యక్షురాలు చింతాడరమణమ్మ, సంఘం ప్రతినిధులు, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పుల బాధతో హోంగార్డు ఆత్మహత్య



శ్రీనివాసరావు(ఫైల్)



ఆత్మహత్యకు పాల్పడిన హోంగార్డు శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని లచ్చారాయపురం గ్రామానికి చెందిన హోంగార్డు కాట్రగాన శ్రీనివాసరావు(47) అప్పుల బాధ తాళలేక బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రాజాం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు శ్రీనివాస రావు ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండడంతో ఇంటి అవసరాల నిమిత్తం అధికమొత్తంలో అప్పులుచేశాడు. అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతూ తనలో తానే కుమిలిపోయేవాడు. ఈ కారణంగానే పురుగు మందు తాగేశాడని తెలుసుకుని రాజాం ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. పరిస్థితి కుదుటపడక పోగా విషమించడంతో రాగోలు జెమ్స్‌కు తరలించి వైద్యం అందించినప్పటికీ ఫలితం లేకపోయిందని కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఉదయకుమారితో పాటు కుమారుడు ప్రేమ్ కుమార్, కుమార్తె ప్రసన్నలత ఉన్నారు. కుమార్తెకు వివాహం జరిగి అత్తవారింటివద్ద ఉంటోంది. కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. హోంగార్డు ఆత్మహత్యపై భార్య ఉదయకుమారి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ శ్రీనివాస రావు తెలిపారు.

గడ్డి మందు తాగి మహిళ మృతి

వీరఘట్టం: మండలంలోని యు.వెంకంపేట గ్రామానికి చెందిన వాన రమణమ్మ (55) బుధవారం పొరపాటున గడ్డి మందు తాగి మృతి చెందింది. దీనిపై గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న రమణమ్మ నిత్యం మందులు, టానిక్‌లు వాడుతోంది. ఈ క్రమంలో ఆమె తాను వాడే టానిక్స్ పక్కనే పంట చేలో పిచికారీ చేసేందుకు తెచ్చిన గడ్డి మందు ఉండడంతో అనుకోకుండా కొంచెం గడ్డి మందును తీసుకుంది. గడ్డి మందు తాగిన తర్వాత గొంతు, నోటిలో మంట పుట్టడంతో గట్టిగా కేకలు వేయగా భర్త నారాయణరావు, బంధువులు గమనించి ఆమెను వీరఘట్టం పీహెచ్‌సీకి తీసుకువచ్చి వైద్య చికిత్సలు అందజేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.ఈ విషయంపై శ్రీకాకుళం రిమ్స్ నుంచి సమాచారం వచ్చినట్లు ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో హోంగార్డు మృతి



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రూరల్ సీఐ ఉపేంద్ర కొత్తవలస ఏఆర్ ఎస్సై, వల్లంపూడి ఎస్సై రాజేష్



హోంగార్డు వెంకటసత్యం (ఫైల్)

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన హోంగార్డు గిడుతూరి వెంకటసత్యం (48) విద్యుత్ షాక్‌తో బుధవారం మృతి చెందారు. ఇందుకు సంబంధించి వల్లంపూడి ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెంకటసత్యం కొత్తవలస దిశ పోలీస్‌స్టేషన్‌లో జీపు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఉదయం 6గంటల సమయంలో ఇంటి సమీపంలో ఉన్న పాన్ షాప్ దగ్గర ఐరన్‌రాడ్‌తో నిలబడిన సమయంలో విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై అక్కడిక్కడే మృతిచెందారు. దీనిపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నామని, పోస్టుమార్టం ఎస్.కోట ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించామని ఎస్సై రాజేష్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఎస్.కోట రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర బొద్దాం వెళ్లి మృతిచెందిన వెంకటసత్యం కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన సౌకర్యాలు అందేలా చూస్తామని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతుడికి భార్య పార్వతి, కొడుకు , కూతురు ఉన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..

పార్వతీపురం టౌన్: మక్కువ నుంచి చెముడు వెళ్తుండగా మార్గమధ్యంలో మంగళవారం రాత్రి బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంపై జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మక్కువ గ్రామానికి చెందిన గొర్జన వెంకటనాయుడు (70), ఎల్.శ్రీరామం బైక్‌పై మక్కువ నుంచి చెముడు వెళ్తుండగా మార్గమధ్యంలో వైఎస్సార్ కాలనీ దాటే సరికి ఎదురుగా పశువులు రావడంతో సడన్ బ్రేక్ వేయగా బైక్ స్కిడ్ అయి వారిద్దరూ రోడ్డుపై పడిపోయారు. దీంతో స్థానికులు గమనించి వారిద్దరినీ మక్కువలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్లగా డాక్టర్ ప్రథమ చికిత్స చేసి పార్వతీపురం తీసుకు వెళ్లాలని సూచించగా కారులో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయమైన వెంకటనాయుడు(70) చికిత్స పొందుతూ మృతిచెందాడు. శ్రీరామ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం తరలించారు.

హరహర మహాదేవ..

- గుళ్ల సీతారాంపురంలో శైవశిల్పాలు
- 10వ శతాబ్దంలో శైవక్షేత్రంగా విరాజిల్లిన గ్రామం



సీతారాముల ఆలయ ముఖ ద్వారంపై చెక్కిన శృంగార శిల్పం




అలంకరించిన పదవ శతాబ్దపు నంది




కళింగ శైలి నంది



పదవ శతాబ్దపు శివలింగం



అరుదైన వినాయకుడి విగ్రహం



కాళికాదేవి


రాజాం సిటీ: అపూర్వమైన శైవశిల్పాలకు ఆలవాలం గుళ్లసీతారాంపురం గ్రామమని, పదవ శతాబ్దంలో ప్రసిద్ధి శైవక్షేత్రంగా విరాజిల్లిందని రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం తెలిపారు. రాజాం చరిత్ర రచనలో భాగంగా ఇటీవల ఆయన ఆ గ్రామాన్ని సందర్శించిన సమయంలో ఈ విషయం కనుగొన్నట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడుతూ..350 ఏళ్లుగా బొబ్బిలి రాజుల కాలం నుంచి సీతారామ క్షేత్రంగా పిలిచే ఈ ఊరు గంగ రాజుల కాలంలో ప్రసిద్ధ శైవ క్షేత్రమని, గతంలో ముగడపేట, గొల్ల సీతారాంపురంగా పిలిచేవారన్నారు. దక్షిణాన తోటలోని శివాలయంలో 10వ శతాబ్దపు లింగం, అలంకరించిన నందిని తాను చూశానని తెలిపారు. ఈ ఆలయంలో వినాయకుడి విగ్రహం నాలుగు చేతులు కలిగి ఉందని, చేతులలో సర్పం, ఢమరుకంతో శివలింగం, కుడుము గల అతి అరుదైన శిల్పమని పేర్కొన్నారు. అలాగే కళింగ శైలి నంది, కాళికాదేవి, కళింగానికి చెందిన శివలింగం ఉన్నాయని అన్నారు. అవి క్రీస్తు శకం 10వ శతాబ్దం నుంచి 14వ శతాబ్దం మధ్యలో అప్పుడప్పుడు చెక్కించిన విగ్రహాలని తెలిపారు. అంతేకాకుండా సీతారాముల ఆలయ ముఖద్వారంపై ఇదే కాలానికి చెందిన శృంగార శిల్పం, ఆలయానికి ముందర ఖాళీ స్థలంలో లలితాదేవి విగ్రహం ఉన్నాయని, అవన్నీ అత్యంత ప్రాచీనమైనవన్నారు. ఈ విగ్రహాల స్థితిగతులపై ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ముఖ్యకార్య నిర్వహణాధికారి ఈమని శివనాగిరెడ్డిని సంప్రదించగా ఆయా దేవతలను, కాలాలను ఆయన ధ్రువీకరించారని రంగనాథం తెలిపారు. సమావేశంలో పిల్లా తిరుపతిరావు, డాక్టర్ ఆల్తి మోహనరావు, గార సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష

పార్వతీపురం: వర్షాకాలం దృష్ట్యా రోగాలు ప్రబలకుండా రానున్న మూడు నెలలు ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో వైద్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. రిఫరల్ కాకుండా స్థానికంగానే మంచి వైద్యం అందించాలని కోరారు. గ్రామాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమస్యలపై ఆరా తీయాలని సూచించారు. ఆస్పత్రుల వారీగా మలేరియా చికిత్స పొందిన కేసుల వివరాలు, మందుల వాడుతున్న తీరుపై తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మలేరియా నివారణకు చేపట్టిన చర్యలను వివరించడంతోపాటు మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో స్ప్రేయింగ్ చేస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి టి. జగన్‌మోహన్‌రావు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి బి.వాగ్దేవి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి



నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి

విజయనగరం క్రైమ్: నూతన చట్టాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కల్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో కొత్త చట్టాలపై బుధవారం విజయనగరం, మన్యం జిల్లాల పోలీస్ అధికారులు, మోటార్ వాహన అధికారులు, సచివాలయ మహిళా సంరక్షణ పోలీసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత న్యాయవ్యవస్థలో వచ్చిన కొత్త చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ న్యాయ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినియం తదితరవాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. మోటార్ వాహనాల చట్టం గురించి వివరించారు. చట్టాలను కఠినంగా అమలుచేయాలని సూచించారు. హెల్మెట్ ధారణపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయ కల్యాణి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేలూరి రఘురామ్ నల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్, నేరపరిశోధనలో తీసుకోవాల్సి న జాగ్రత్తలు, కొ త్త చట్టాల్లో వచ్చి న మార్పులను వి వరించారు. ప్రొబేషన్ అధికారి ఎం.శరత్ బాబు జువైనల్ చట్టాలపైన అవగాహన కల్పించారు. కా ర్యక్రమంలో అధి క సంఖ్యలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.